క్లుప్తంగా

మహిళా ఉద్యోగులకు చీరల పంపిణీ



బాల్కొండ: బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలోని మహిళ ఉద్యోగులకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సొంతంగా సరఫరా చేసిన చీరలను మంగళవారం గ్రామాల్లో సర్పంచ్‌ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..మహిళలను గౌరవించాలనే ఉద్దేశంతో చీరలు అందించడం అభినందనీయమన్నారు.

హాసాకొత్తూర్‌లో పారిశుధ్య కార్మికులకు..



కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ ఆయాలకు చీరలను పంపిణీ చేశారు. సర్పంచ్ ఏనుగు పద్మ, ఉప సర్పంచ్ ఏనుగు రాజేశ్వర్, కారోబార్ వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో..



వేల్పూర్: వేల్పూర్ గ్రామ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి వితరణ చేసిన చీరలను ఎంపీపీ బీమజమున, జీపీ పాలకవర్గం మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తీగెల రాధామోహన్, ఉపసర్పంచ్ పిట్లసత్యం, ఎంపీటీసీ మొండి మహేశ్, గ్రామ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు బబ్బూరు ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు..



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఫత్తేపూర్‌లో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు సర్పంచ్ కొత్తపల్లి లక్ష్మీ అందజేశారు. గ్రామానికి చెందిన గడ్డం ముత్యం, బోడ మల్కన్న ఇటీవల అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్సలు చేయించుకున్నారు. దీంతో ఎమ్మెల్యే జీవన్ రెడ్డి చెక్కులు మంజూరు చేయించారు. బీఆర్‌ఎస్ నాయకులు కొత్తపల్లి లింబాద్రి, ఎంపీటీసీ హన్మాండ్లు, గ్రామ అధ్యక్షుడు వజ్రం రెడ్డి, సోదర్ రెడ్డి, సదాశివ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



బోధన్: బోధన్, సాలూర మండలాల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను మంగళవారం పట్టణ కేంద్రంలోని రాకాసీపేట్ జీపీఎస్‌లో ఎంఈవో నాగ్‌నాథ్ ఆయా కాంప్లెక్స్ ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలకు అందించారు. ఉమ్మడి బోధన్ మండలాల పాఠశాలలకు 52 వేల 121 పాఠ్య పుస్తకాలు వచ్చాయని మండల విద్యాశాఖ అధికారులు తెలిపారు. సీఆర్‌పీలు బాబు, విజయ్, షఫీ, శివానందం, అరవింద్, ఉపాధ్యాయులు రాజు , వసంత్, జగదీష్, సునీత పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లిలో..



కమ్మర్‌పల్లి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన పాఠ్య పుస్తకాలను మంగళవారం పంపిణీ చేశారు. మండల విద్యా వనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులకు ఎంఈవో ఆంధ్రయ్య పాఠ్య పుస్తకాలను అందజేశారు. 15,224 పుస్తకాలు వచ్చినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 20న నిర్వహించే విద్యా దినోత్సవం రోజున విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేయాలని సూచించారు. సీఆర్‌పీలు అంజయ్య, రాజేష్, లలిత, శైలజ, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

నీలా హైస్కూల్‌లో..

రెంజల్(బోధన్): మండలంలోని నీలా హైస్కూల్‌లో మంగళవారం స్థానిక సర్పంచ్ లలిత, వైస్ ఎంపీపీ యోగేశ్, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రావ్‌లు ఎల్‌ఈడీ స్క్రీన్‌ను ప్రారంభించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో డిజిటల్ పద్ధతిలో విద్యాబోధన అందించేందుకు దోహదం చేస్తుందన్నారు. మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా భారీ ఎల్‌ఈడీ ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు.

ఆ రెండూ అభివృద్ధి నిరోధక పార్టీలు

- ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి
- ఆలూర్ మండలం దేగాంలో నమస్తే నవనాథపురం కార్యక్రమం



దేగాంలో సమస్యలు తెలుసుకుంటున్న ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి

ఆర్మూర్: సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజా రంజకమైన పాలన సాగుతూ దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్‌గా నిలుస్తోందని పీయూసీ చైర్మన్, ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆలూర్ మండలం దేగాంలో నమస్తే నవనాథపురం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే పాదయాత్ర చేస్తూ గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ ప్రగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్మూర్ నియోజకవర్గంలో ఇప్పటికే రూ.3 వేల కోట్లతో అభివృద్ధి చేశామని, అయినా బీజేపీ, కాంగ్రెస్ నేతలు అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అభివృద్ధి నిరోధక పార్టీలని అన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్ద పీట

ఆర్మూర్: తెలంగాణ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆలూర్ మండల కేంద్రంలోని గురడిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా సంక్షేమ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి దంపతులు పాల్గొని మహిళలనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమానికి హాజరైన మహిళలకు ఎమ్మెల్యే దంపతులు చీరలు అందజేశారు. జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, మున్సిపల్ చైర్ పర్సన్ పండిత్ వినీత, జడ్పీటీసీ సభ్యుడు సంతోష్, ఆర్మూర్ ఎంపీపీ నర్సయ్య, వైస్ ఎంపీపీ చిన్నారెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఉత్తమ ప్రధానోపాధ్యాయురాలికి ప్రశంసా పత్రం

ఆర్మూర్: గోవింద్‌పేట్‌లోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న మాడవేడ పద్మావతికి ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ప్రశంసాపత్రాన్ని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఆర్మూర్ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి, రజితరెడ్డి దంపతులు అందజేశారు.

రోడ్ల అభివృద్ధికి భారీగా నిధులు

డొంకేశ్వర్(ఆర్మూర్): రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల రోడ్ల అభివృద్ధికి పెద్దపీట వేసి నిధులు ఖర్చు చేస్తోందని ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం డొంకేశ్వర్ మండలం మారంపల్లిలో ఉపాధిహామీ కింద చేపడుతున్న గ్రావెల్ లింక్ రోడ్డు పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాక్టర్‌పై ఎక్కి కొద్దిదూరం నడిపారు. సర్పంచ్ సత్తెవ్వ నారాయణ రెడ్డి, ఉప సర్పంచ్ అర్గుల రవి, ఎంపీటీసీ గంగుబాయి జనార్ధన్, ఎంపీడీవో నాగవర్ధన్ పాల్గొన్నారు. మారంపల్లికి చెందిన బీజేపీ నాయకులు బాలాజీతో పాటు సుమారు 50 మంది యువకులు ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు.

కిక్ బాక్సింగ్ క్రీడాకారిణికి అభినందన

డొంకేశ్వర్(ఆర్మూర్): జాతీయ, రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన దత్తాపూర్ గ్రామానికి చెందిన మూడ్ లావణ్యను ఎమ్మెల్యే జీవన్ రెడ్డి అభినందించారు. గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రానికి, జిల్లాకు పేరు తెచ్చినందుకు శాలువా కప్పి సన్మానించారు. ఇంటి నిర్మాణానికి రూ.3లక్షల సాయం అందిస్తామని, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తామని హామీ ఇచ్చారు.

కేంద్రీయ విద్యాలయం నిర్మాణానికి పదేళ్లు

- కేంద్ర మాజీ మంత్రి ప్రకాశ్ జవదేకర్



పనులను పరిశీలిస్తున్న జవదేకర్, ఎంపీ అర్వింద్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లో కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయం పనులు పూర్తి కావడానికి మరో 10 ఏళ్లు పడుతుందని, పనులు ఆలస్యంగా జరగడంపై కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యులు ప్రకాశ్ జవదేకర్ అసహనం వ్యక్తం చేశారు. మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బోధన్ పట్టణంలోని పాండుఫారం శివారులో నిర్మిస్తున్న కేంద్రీయ విద్యాలయం పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల జాప్యంపై ఏజెన్సీ ప్రతినిధులతో అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో నరేంద్ర మోదీ 9 ఏళ్ల పాలన పూర్తి చేశారని, ఈ సందర్భంగా దేశ వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలిస్తున్నామన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్, జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీనారాయణ, నాయకులు పల్లె గంగారెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ప్రకాశ్ జవదేకర్‌కు ఘన స్వాగతం

ఎడపల్లి(బోధన్): నిజామాబాద్ నుంచి బోధన్ వెళ్తున్న ఎంపీ అరవింద్, కేంద్ర మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్‌లకు ఎడపల్లి మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు జాన్కంపేట్ వద్ద ఘన స్వాగతం పలికారు. జానకంపేట నుంచి బోధన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సన్మానించారు. బీజేపీ నేత కమలాకర్ రెడ్డి, సర్పంచ్ లు సాయిలు, శ్రీధర్, ఇంద్రకరణ్ పాల్గొన్నారు.

లిఫ్టు పరిశీలన



డొంకేశ్వర్(ఆర్మూర్): నికాల్‌పూర్ వద్ద గల అన్నపూర్ణ ఎత్తిపోతల పథకాన్ని ఇరిగేషన్ అధికారులు మంగళవారం పరిశీలించారు. లిఫ్టు ద్వారా తొండకూర్ గ్రామానికి సాగునీరు సక్రమంగా రావడం లేదని ఎంపీటీసీ మద్దుల రాణి ఇటీవల జిల్లా కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఇరిగేషన్ డీఈ రవికుమార్, ఏఈలు వచ్చి తొండకూర్ నుంచి నికాల్‌పూర్ మెయిన్ లిఫ్టు వరకు పరిశీలించారు. సమస్యలను గుర్తించిన అధికారులు కలెక్టర్‌కు నివేదిస్తామని, పది రోజుల్లో సాగునీరందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు హామీ ఇచ్చారు.

బాధితులకు పరామర్శ

భీమ్‌గల్ : బెజ్జోర గ్రామానికి చెందిన రాజేశ్వర్ ఇటీవలె ప్రమాదవశాత్తూ మరణించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద మరణించడంతో వారు అండ కోల్పోయారు. విషయం తెలుసుకున్న ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత ముత్యాల సునీల్ కుమార్ వారి కుటుంబాన్ని మంగళవారం పరామర్శించారు. వారు కిరాణ దుకాణం పెట్టుకోవడానికి ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు.

ముదిరాజ్‌లకు రుణాలందించాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): బీసీ రుణ ప్రణాళికలో ముదిరాజ్‌లకు స్థానం కల్పించి రుణాలందించాలని డొంకేశ్వర్‌కు చెందిన తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు టి.రాజేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ముదిరాజ్ కుటుంబాలు చాలా ఉన్నాయన్నారు. ఇప్పటి వరకు ఎలాంటి రుణాలు అందలేదని, ప్రస్తుతం బీసీల్లో పలు కుల వృత్తులకు అందిస్తున్న మాదిరిగానే ముదిరాజ్‌లకు కూడా రూ. లక్ష రుణం అందించాలని కోరారు.

క్రికెట్ టోర్నీ విజేత బాబాపూర్



వేల్పూర్: పడగల్‌లో రంజిత్ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన స్వర్గీయ వేముల సురేందర్‌రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం సాయంత్రం ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో భీమ్‌గల్ మండలం బాబాపూర్ డీడీఎల్ జట్టు విజేతగా నిలిచింది. రన్నర్‌గా బాల్కొండ తల్వార్ బ్రదర్స్ జట్టు నిలిచింది. విన్నర్, రన్నర్ జట్లకు టోర్నీ నిర్వాహకులు, బాబాపూర్ సర్పంచ్ అజీజ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

గోవులను సంరక్షించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రుద్రూర్: మానవాళికి ఎంతో ప్రయోజనం కల్గిస్తున్న గోవులను సంరక్షించాలని మోస్రా బజరంగ్‌దళ్, గోరక్ష సమితి సభ్యులు కోరారు. ఈ మేరకు మంగళవారం మోస్రా తహసీల్దార్ సాయిలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎంతో పవిత్రంగా పూజించే గోవులను వాహనాల్లో, క్లోజ్డ్ కంటైనర్లలో అక్రమ రవాణా చేస్తున్నారని, దీన్ని అరికట్టాలని కోరారు. గ్రామాల్లో దేవాలయాలకు వదిలేసిన గోవులను వేలం పాట ద్వారా కొందరు విక్రయిస్తున్నారని, దీన్ని అడ్డుకోవాలని, గోసంతని సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. గోరక్ష ప్రముఖ్ సతీష్, ప్రసాద్, ప్రీతంపాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



బోధన్‌రూరల్(బోధన్): గ్రామీణ ప్రాంత ప్రజలు మూఢ నమ్మకాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని బోధన్ రూరల్ ఎస్సై సందీప్ అన్నారు. సోమవారం రాత్రి చిన్నమావందిలో బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పోలీసు కళాబృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సందీప్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ మోసాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలని, మోసపోతే వెంటనే పోలీసులకు లేదా 1930 నెంబర్‌కు సంప్రదించాలన్నారు. మహిళలను ఎవరైనా వేధిస్తే కఠిన చర్యలు తీసుకునేందుకు షిటీంలు పనిచేస్తున్నాయని వివరించారు.

పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని హౌసింగ్‌బోర్డులో గల శ్రీ చైతన్య పాఠశాల ఎదుట తెలంగాణ విద్యార్థి పరిషత్ నగర అధ్యక్షుడు అఖిల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ.. శ్రీ చైతన్య పాఠశాలకు అధికారులు వద్ద ఒక బిల్డింగ్ అనుమతి తీసుకొని రెండు బిల్డింగులలో తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కొత్త బిల్డింగులో నడుస్తున్న దానికి ఎటువంటి అనుమతి గానీ, భద్రతా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు లేవన్నారు. వెంటనే చైతన్య పాఠశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు.

స్పందించిన విద్యుత్ శాఖాధికారులు

సాక్షి ఎఫెక్ట్..



బోధన్‌రూరల్(బోధన్): బోధన్, సాలూర మండలాల్లో అస్తవ్యస్తంగా ఉన్న విద్యుత్ వ్యవస్థపై సోమవారం 'సాక్షి'లో పొలాల్లో 'మృత్యుపాశాలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ స్పందించింది. మంగళవారం సాలూర మండలంలోని కొప్పర్తి సమీపంలో పంట పొలాల్లో వంగిన కరెంట్ స్తంభాలు, వేలాడుతున్న కరెంట్ తీగలను ట్రాన్స్‌కో ఏఈ కల్యాణ్ ఆధ్వర్యంలో మరమ్మతులు నిర్వహించారు. ట్రాన్స్‌కో ఏఈ కల్యాణ్ పర్యవేక్షణలో కరెంట్ స్తంభాలు, కరెంట్ తీగలను సరిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాలూర మండలం, బోధన్ టౌన్–2లో ఏమైనా విద్యుత్ సమస్యలు ఉంటే 94910 58659 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

మహిళలకు అండగా కేసీఆర్ ప్రభుత్వం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి తదితరులు

బోధన్: మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, ఆరోగ్యం, భద్రతే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వం ప్రతి ఇంటి ఆడబిడ్డకు అండగా నిలుస్తోందని వక్తలు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వివిధ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మహిళ సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మాశరత్ రెడ్డి, జెడ్పీ వైస్ చైరపర్సన్ రజితా యాదవ్, ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా, ఆర్డీవో రాజేశ్వర్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, సీడీపీవో జానకి తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. మహిళ ప్రగతి నివేదిక కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ..ఉత్తమ సేవలందిస్తున్న మహిళ ఉద్యోగులను కొనియాడారు. ఉత్తమ సేవలందిస్తున్న అంగన్‌వాడీ, ఆశా వర్కర్స్, ఐకేపీ మహిళా ఉద్యోగులను సన్మానించి అభినందించారు. ఏఎంసీ చైర్మన్ వీఆర్‌దేశాయ్, వైస్ చైర్మన్ షకీల్, ఎంపీపీ బుద్దె సావిత్రి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీంద్రయాదవ్, కౌన్సిలర్లు శరత్‌రెడ్డి, శ్రీకాంత్ గౌడ్, పిట్ల సత్యం, దూప్‌సింగ్, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

- మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి



నీలాలో రైతులతో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

రెంజల్(బోధన్): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం కందకుర్తి, నీలా గ్రామాల్లో పర్యటించిన అనంతరం బూత్ స్థాయి కార్యకర్తలు, రైతులతో సమావేశమయ్యారు. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ.. గతంలో తాను మంత్రిగా ఉన్న సమయంలో చేసిన అభివృద్ధి తప్ప బీఆర్‌ఎస్ హయంలో ఏం అభివృద్ధి జరగలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అవినీతిపరులు, అక్రమార్కుల ఆటలను అరికడతామన్నారు. ప్రస్తుతం ఉన్న పథకాలను తొలగిస్తామని బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. వాటిని కొనసాగిస్తూనే డిక్లరేషన్‌లో ప్రకటించిన నిరుద్యోగ భృతి రూ.4 వేలు, సిలిండర్ రూ.500, ధాన్యం ధర రూ. 2500, ఆరోగ్యశ్రీ రూ.2 లక్షలు, ఉపాధి కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు, రైతుబంధు ఎకరాకు రూ.15 వేలు, రుణమాఫీ రూ.2 లక్షలు, ఇళ్ల నిర్మాణాలకు రూ.5 లక్షల చొప్పున అందిస్తామని చెప్పారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి, నాయకులు ముప్ప గంగారెడ్డి, సాయరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా నిర్వహించండి



రుద్రూర్: కొత్త ఓటరు నమోదుకు, జాబితాలో మార్పులు, చేర్పుల కోసం సర్వే పకడ్బందీగా చేయాలని మోస్రా తహసీల్దార్ సాయిలు సూచించారు. మోస్రా తహసీల్ కార్యాలయంలో బీఎల్‌వోలకు సర్వే గురించి అవగాహన కల్పించారు. రెండు ఓట్లు ఉన్నా, చనిపోయినా, ఇతర ప్రాంతాలకు వెళ్లినా.. వారి వివరాలు సేకరించాలన్నారు. ఎంఆర్‌ఐ నాగమణి, బీఎల్‌వోలు నాగమణి, ఎలిజబెత్ రాణి, లక్ష్మీ, సుజాత తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

నవీపేట: దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీఎస్ జాతీయ మహిళా అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ మాట్లాడారు. దివ్యాంగుల సమస్యలపై నిరంతరం పోరా టం చేయగా కంటి తుడుపు చర్యగా రూ. వెయ్యి పింఛన్ పెంచి ప్రభుత్వం చేతులు దులుపుకుందని ఆరోపించారు. రూ.6 వేల వరకు పింఛన్‌ను పెంచా లని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ వీర్‌సింగ్‌కు అందజేశారు.

ఆలయానికి చేరిన దేవతా విగ్రహాలు



మాక్లూర్: వెంకటాపూర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈ నెల 14న విగ్రహ ప్రతిష్ఠాపనకై దేవతా విగ్రహాలను మంగళవారం ఆలయ ప్రాంగణానికి చేర్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ భవాని రఘు, వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – మేమ్ ఫేమస్ 12.20 6.35
స్పైడర్ మాన్ -(తెలుగు) 3.30
పరేషాన్ 9.45

స్క్రీన్-2 – ట్రాన్స్‌ఫార్మర్స్(3డి-తెలుగు)-10.40, 1.35, 4.30, 7.25, 10.20

స్క్రీన్-3 – అన్‌స్టాపబుల్(తెలుగు) 10.35 7.00 యూనివర్సిటీ1.05 ఇంటింటి రామాయణం 4.10 9.35

స్క్రీన్-4 – టక్కర్ 12.20 6.30 9.30
మేమ్ ఫేమస్ 3.20

సంక్షిప్తం

అందుబాటులో పసుపు వంగడాలు

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని పసుపు పరిశోధన స్థానంలో అధిక కుర్కుమిన్ కలిగిన విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ మహేందర్ తెలిపారు. 150 క్వింటాళ్ల విత్తనం అందుబాటులో ఉందని, ఇందులో దేశవాలీ రకాలు, నాణ్యమైన విత్తనాలు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల రైతులు పరిశోధన స్థానంలో సంప్రదించాలని సూచించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం



రుద్రూర్: మండల కేంద్రంలో మేరు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మేరు సంఘ సభ్యులు మాట్లాడుతూ..బీసీ రుణం రూ.లక్ష అందించేందుకుగాను లబ్ధిదారుల జాబితాలో చేర్చినందుకు సీఎం కేసీఆర్‌కు, అసెంబ్లీ స్పీకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌లోకి రెడీమేడ్ దుస్తులు రావడంతో పని దొరక్క ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గీత, చేనేత కార్మికుల్లాగా 50 ఏళ్లకే ఆసరా పింఛన్లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వైస్ ఎంపీపీ నట్కరి సాయిలు, ఉమ్మడి మండల మేరు సంఘం అధ్యక్షుడు కౌలాస్ గంగాధర్, రుద్రూర్ మండల అధ్యక్షుడు ఎన్నవార్ ధర్మపురి తదితరులు పాల్గొన్నారు.

టీచర్లు, లెక్చరర్ల కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఎడపల్లి(బోధన్): మండల కేంద్రంలోని టీఎస్‌ఆర్‌ఎస్ మహిళల జూనియర్ కాలేజీలో బోధించడానికి టీచర్, లెక్చరర్లు, పీఈటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుహాసిని మంగళవారం తెలిపారు. ఈ నెల 17న గురుకుల పాఠశాలలో దరఖాస్తు చేసుకున్నవారికి డెమో క్లాసులు ఉంటాయని తెలిపారు. సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

చెరుకు రైతులను ఆదుకోవాలి

నిజామాబాద్ సిటీ: చెరుకు పండించే రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ ఆల్ ఇండియా కార్యదర్శి కొండెల సాయారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నిజామాబాద్ రూరల్ మండలం సారంగపూర్ షుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో నాలుగు జిల్లాలకు చెందిన చెరుకు రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాయారెడ్డి మాట్లాడుతూ.. సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీని ప్రభుత్వ నడిపేందుకు ముందుకు రావటంలేదని, దాంతో ఫ్యాక్టరీలో ప్రభుత్వ వాటా ధనం రూ.50 లక్షలు వాపస్ చేసి ఫ్యాక్టరీని తామే నడుపుకుంటామని అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంపై 9 మంది చెరుకు రైతులు హైకోర్టులో కేసు వేయగా కోర్టు తమ అభ్యర్థనను స్వీకరించటం జరిగిందన్నారు. నాలుగు జిల్లాలో రైతుల సభ్యతం వేగవంతం చేయాలన్నారు. లక్షల సంఖ్యలో రైతులకు సంఘంలో సభ్యత్వం కల్పిస్తే సంఘానికి ఎంతో బలం చేకూరుతుందన్నారు. సంఘ్ జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డి, తెలంగాణ చెరుకు విభాగ్ కన్వీనర్ ఆనంద్ రావు, ఉపాధ్యక్షులు సూర్యరెడ్డి పాల్గొన్నారు